
# వెన్నెల



పెరటి వసారాలో పంచ కింద గదిలో తను పుట్టగానే, మంచం మీద అమ్మ పక్కన పడుకోబెట్టగానే కిటికీలోంచి చూస్తే తనకి బోధ పడలేదు గాని అది రాత్రే, అక్కడ నిండు చంద్రుడే. అదంతా పండు వెన్నెలే. అప్పుడు ప్రసవించిన బాధతో అమ్మ మూలిగే ఉంటుంది. సంతోషంతో అమ్మ నవ్వే ఉంటుంది. తను ఏడుస్తూ ఆ చంద్రుణ్నే చూసే ఉంటుంది. ఏడ్చేడ్చి అలసి పోయిన తనను ఆ రోజున కిటికీలోంచి జారిన చిరు వెన్నెల ఆ రోజు మెల్లగా నిమిరే ఉంటుంది. అమ్మ నొప్పి పోయేలా చల్లగా విసిరే ఉంటుంది.

కానీ–

మరొక నెల్లాళ్ళకే. ఎంత రాత్రయ్యిందో కాని అప్పుడు కూడా అదే నిండు చంద్రుడు. అప్పుడు కూడా అదే పండు వెన్నెలే. అప్పుడా చీకటి గదిలో అదే కుక్కి మంచం మీద పడుకుని జీవితంలో వెన్నెల కోసం ఆఖరిసారిగా అటు తిప్పిన అమ్మ ముఖం మీద, ఆరని కన్నీటి మీద ఆ కిటికీ లోంచి జారిన వెన్నెల జీర జాలిగా ఆమెను జోకొట్టి ఉంటుంది. అప్పుడు తను ఆ పక్కనే ఉన్నాడు కానీ అమ్మ కంటి మీద ఆఖరి వెన్నెలని కాని అమ్మ కంటిలోని కాటుక చీకటినిగాని తను చూడనైనా చూడలేదు. సుఖంగా పడుకో కుండా కళ్ళు విప్పి లేచి కాళ్ళూ చేతులూ కొట్టుకొని నెత్తీ నోరూ మోదుకుని కెవ్వుమని కేర్‌మని బావురుమని ఏడవాలని తనకెవరూ అప్పుడు చెప్పనైనా చెప్పలేదు.

ఆ తరువాత–

కొన్నాళకు మరి ఏడెళ్ళకు తమ తాత గారింటి నుంచి గాబరా గాబరాగా గుమ్మందాకా ఎవరి కెయ్యో పట్టుకుని వచ్చి అక్కడి నుంచి రివ్వుమని ఇంట్లోంచి పరుగెట్టి, పెరట్లోకి వెళ్ళి, అక్కడ

> “మనిషి బతుకులోని చీకటిని 'వెన్నెల'లో చూపించిన రావిశాస్త్రి అసాధారణమైన కథ ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక తొలి సంచికల్లో కలర్‌లో వచ్చిన తొలికథ”

పొట్ల పందిరి కింద చాప మీద అచలంగా పడుకున్న నాన్న దగ్గరికి వెళ్ళి అక్కడ కూర్చున్న అక్కని కావలించుకొని ఏడ్చినప్పుడు తన కళ్ళంట కారినవి వెచ్చ వెచ్చని కన్నీటి ధారలే! అక్క కళ్ళ నుంచి ప్రవహించినవి కటిక చీకటి రేఖలే. అప్పుడక్కడ ఆ పందిరి కింద అటు చూస్తే ఆ నిశ్శబ్దంగా పడున్న నాన్న మీద అమ్మయ్యో!

“అక్కయ్య అదేంటది”

“ఏం చెప్పను తమ్ముడా అది మచ్చ మచ్చల జాతి వెన్నెలే!”


ఆ తరువాత జ్ఞాపకం లేదా?

జ్ఞాపకం ఉందవునానాడూ వెన్నెలే, ఎన్నడూ?

అక్క పెళ్లినాడు.

అనాడు వాకిట్లో పందిరి కింద భగభగలాడేది పెట్రోమాక్సు దీపమే. అయినప్పటికి పందిరి పైపంతా కలకలా వెలిగినది వెన్నెలే. పండు వెన్నెల పందిరి కింద పెళ్లి తతంగం మధ్య పందిరిలో కనిపించినది వరుడుకివ్వాల్సిన కట్నమే. అప్పుడు కోపించి పీటలమీంచి లేచినవాడు రెండో పెళ్లి కుమారుడే. అందరి మధ్య అతని కాళ్ళు పట్టుకుని ఘొల్లున ఏడ్చిన వాడు సాక్షాత్తు తన తల్లి తోబుట్టువే. అప్పుడు పక్కకు పోయి గదిలో కూలబడిన అక్కకి గుండెనిండా నిప్పులే. ఆమె చుట్టూ చీకటే

# రాచకొండ విశ్వనాథశాస్త్రి



అంతలోనే ఆ చీకట్లోంచి లేచి ఆ పసువు బట్టలతో పరుగెట్టిన అక్కనిండా అక్కచుట్టూ ఆ క్షణంలో అహో - అయ్యో - భగ్గుమన్నది బంగారపు వెన్నెలే. ఆ రాత్రి గట్టు మీద కాలు పెట్టి ఆకాశానికి దండం పెట్టి అమ్మయ్యో అమ్మయ్యో ఆ రాత్రి నిరాశతో తన అక్క నూతిలో దూకి నప్పుడు నిశ్చేష్టుడై నిలబడిపోయి పైనుంచి చూసిన వాడు శివుని జటాజూటపు చంద్రుడే. కొబ్బరా కులమీంచి నూతిలోనికి జారి పడినప్పటికీ కూడా అక్కని తాకనైనా తాకలేక పోయినవి అతని సుకుమారపు చేతులే. అక్కని "అయ్యయ్యో నా అక్కయ్యని" పైకి తీసిన తరువాత, చల్లారిన ఆమె శోకాగ్నిని చూసి పరి తపించి అశ్రుధారలతో ఆమెను తడిసి ముంచెత్తనన్న ఆ మహనీయుని, ఆ దయామయుని కన్నులే కన్నులు.

అల్లప్పుడు
ఆ రోజున

తన పరీక్ష పాసయ్యిందో లేదోనని సంత బయలు గట్టువార, చిల్లర కొట్టు దగ్గర సందె చీకట్లో అతి తొందరగా పేపరు వెతికి వెతికి చూసిన రోజున- ముందే వచ్చి కూర్చున్న నెలవంకను చూచి ముఖం మాడ్చుకుని గబగబా దిగిపోయిన ఇనబింబపు ఎరుపింకా ఉన్నప్పటికీ, ఎంతో మసక మసగ్గా వెలి గినదే అయినప్పటికి అది కూడా వెన్నెలే: అక్కరకు రాని మూడవ క్లాసులో తమ పాపయేనని అప్పుడు తను తెలుసుకొన్నప్పుడు అస్తమించిన సూర్యుని లా అయిపోయినవి తన చిల్లర ఆశలే. కానీ పాసయ్యి ఏడాదే చాలు. ఎందుకు నీకీ విచారాలు అని - ఆ నాటి సంత బయలులో ధూళితోనే నిండినప్పటికి గోమూత్రంతో తడిసినప్పటికి కిరసనా యిలు వాసనేకాక ఏవేవో మట్టి వాసనలు వేసినదే అయినప్పటికి- తనని హెచ్చరించినది వెన్నెలే.

> **కృతజ్ఞత**
>
> మహాకవి
>
> శ్రీరంగం శ్రీనివాసరావుగారికి—
>
> **అంకితం**
>
> చిరంజీవి
>
> శ్రీరంగం రాజేశ్వరరావుకి—

అలనాడలనాడారోజున

అహో అవునానాడది పచ్చని పండు వెన్నెలే. అవును ఆనాటి రాత్రి ఆ పందిరి నిండా వికసిత మందహాసాలతో విరబూసినవి నునుమెత్తని మూగ మల్లెలే మల్లెలే. ఎంతో కొంతకు ఏదో ఉద్యోగం ఎలాగోలాగ దొరికిందనిపిస్తే పందిరి పక్క కూర్చుని తన గుండెలకు తల ఆన్చుకుని సంతోషంతో వెక్కి వెక్కి ఏడ్చినది మామ కుమార్తె మానవతి శీలవతి తన నెచ్చెలే నెచ్చెలే. ఆనాడు పచ్చ గుర్రాలెక్కి పరవళ్లు తొక్కుతూ దేవులంతా కూడి తమ మీద మురిసి కురిపించినవి వెన్నెలవి రేకులే మల్లెలవి నవ్వులే.

ఆనాడు ఆమె కడుపులో కదిలినది తమ స్వంత ప్రాణమే. మల్లెల రేకుల్లో వెన్నెల నవ్వుల్లో ఆనాడే ఆనాడే ఆ వెన్నెల్లో ఆ గుండెల్లో చిన్నగా దగ్గినదేదో రోగమే. అవునయ్యా అప్పుడూ వెన్నెలే.

అవును తండ్రీ అప్పుడూ వెన్నెలే. ప్రాణం పోతున్నప్పటికి ఆమె కళ్ళ నిండా నవ్వులే. ఆమె మనసునిండా ఆశలయో ఆశలే. ఆఖరి వరకు ఆమె చేసేవి బాసలే. కాని ప్రాణం మరింక పోక తప్పదని ఆమె తెలుసుకున్నప్పుడు పచ్చటి బాలుడ్ని తన చేతిలో పెట్టి ఆఖరిసారిగా తన వైపు చూసి నవ్వగా మిగిలి పోయినది ఆమె సత్యకాలపుటూపిరే. ఆమె ముఖంలో ఆఖరికి మిగిలిపోయినవి మూగ బాధల నీటి నీడలే. పాలిపోయిన వెన్నెల జాడలే.

పడినవన్నీ చాలు మరింక ఏ కష్టమూ పడకుండా పోయిన అదృష్టం ఆమెదే. ఆమె లేకపోతే తనకి బతుకంతా చీకటే అనిపించకుండా తన చేతిలో కాంతిపుంజం పెట్టిపోయిన దాన శీలం కూడా ఆమెదే.

అవునది ఆమె జల్లిన వెన్నెలే. అవునది ఆమె ఇచ్చిన భాగ్యమే. తల్చుకుంటే వళ్ళు పులకరిస్తుంది. ఆ నవ్వులు అవి ఆమె పోలిక నవ్వులే. తనని ఇన్నాళ్ళిరవయ్యేళ్ళు నిలబెట్టి ఉంచినవి అందు పుట్టిన ఆశలే.

వాని ముఖం నిండా వెన్నెలే కానీ వాని మనసు నిండా నీడలే. వాని గుండె నిండా మంటలే.

అనేవాడు ఎందుకని అడిగితే:

"అంతట వెన్నెలే కానీ ఎచ్చటా చిచ్చులే!"

వెన్నెలా వెన్నెలా నువ్వు చూసే దృశ్యాలకు మనసు చెదురుతుంది వెన్నెలా! నువ్వు చూపే చిత్రాలకు గుండె కరుగుతుందో వెన్నెలా! అది సహజమే కానీ ఆయా దృశ్యాలకి చిత్రాలకి నీ తడితో పసుపు రక్తం ఉడుకుతుందే వెన్నెలా. అది కూడా అతి సహజం కాదటమ్మా వెన్నెలా.

అవును యువరక్తం ఉడుకుతుంది వెన్నెలా
సుళ్ళుగా పరవళ్ళు తొక్కుతుంది వెన్నెలా
వెన్నెలా ఓ వెన్నెలా
అవునానాడు వెన్నెలే.

## ప్రముఖుల ముచ్చట్లు

ప్రఖ్యాత పియానో వాయిద్యకారుడైన పెడరస్కీతో ఒక మగువ ముచ్చటిస్తూ,

"పియానో వాయించడం కష్టమైన పని అని నేను అనుకుంటున్నాను. అవునా?" అంది.

వెంటనే ఆ ప్రతిభావంతుడు ఇలా అన్నాడు–" అది కష్టమైన పనేమీ కాదు. చెయ్యవలసింది ఏమంటే, సరైన వేలును సరైనచోట సరైన సంగీతాన్ని కూరుస్తూ వుంచాలి! అటుపై పియానో చక్కగా తన పని తాను చేసుకుపోతూ అద్భుతమైన సంగీతాన్ని మనకు వినిపిస్తూంది."

– కొడిమెల

ఎడ తెరిపి లేకుండా పట్ట పగ్గాల్లేకుండా దివి నుండి భువికి కురిసిన దానాడది ఎంతో చక్కని వెన్నెలే

ఆ వెన్నెల ఆ శారద రాత్రిలో తన ఇంటి ముంగిట నీడలో బితుకు బితుకు మని కూర్చున్న ష్టదు తనకి వినిపించిన కేకలే ఆవేశపు కేకలు విని వేడెక్కినది తన రక్తమే. అంతలోనే ఆ కేకల మధ్య ఆ సత్యా హింసల మధ్య ఏవిటవి అవెవిటవి?

అవి

అధర్మానివి మర తుపాకులే.

అన్యాయానివి కోరల కరువులే.

ఊరుకోలేక ఉండబట్టలేక వడి వడిగా తడబడుతూ వెళ్ళి చూస్తే మిల్లు చుట్టూ మర తుపాకులే. వాటికెదంగా జన ప్రవాహమే.

పైకి చూస్తే ఆకాశంనిండా ఏటి చల్లని వెన్నెలే. చుట్టూ చూస్తే వీధి నిండా వెండి తెల్లని వెన్నెలే వెన్నెలే. కింద చూస్తే రోడ్డు నిండా ఉడుకు రక్తపు మడుగులే మడుగులే అందులో ఎర్ర నెర్రని వెన్నెలే తడి వెన్నెలే.

ఏ బాధలు చూడలేక, ఏ అన్యాయాలని సహించలేక, ఏ అధర్మాన్ని క్షమించలేక, ఏ మంటలు భరించలేకపోతే పోయిందని ఏమయితే అయిందని ఎదిరించి నిల్చిన తన కొడుకు ప్రాణపు వేడినెత్తురు ఎక్కడమ్మా వెన్నెలా!

"నెత్తురంతా చిమ్మి అరవై మందొక్కసారిగా కూలినపుడు నెత్తురంతా ఒక్కటే.

అవును తల్లీ ఒక్కటే మానెత్తురంతా ఒక్కటే.

కన్న తల్లీ వెన్నెలా


# రూ. 2,50,000/-లు విలువగల బహుమతులు గెలుపొందండి

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |

**ప్రత్యేక బహుమతి:**
హీరో హోండా
మోటార్ సైకిల్ (లేదా)
చేతక్ స్కూటర్ (లేదా)
కలర్ టి.వి.

| | | |
|---|---|---|
| 8 | 13 | 6 |
| 7 | 9 | 11 |
| 12 | 5 | 10 |

**కన్సొలేషన్ బహుమతులు:**
మ్యూచువల్ బెనిఫిట్ పథకము క్రింద కెమేరా, టూ-ఇన్-వన్, ట్రాన్సిస్టర్, శారీస్, రిస్ట్‌వాచ్.

పై ఉదాహరణలోవలె కంప్ట. పోస్ట్‌కార్డ్/ ఇన్‌లాండ్/ ఎన్వెలప్‌పై 9 గడులను వ్రాయండి. 7 నుండి 15 వరకుగల అంకెలను ఉపయోగిస్తూ నిలువుగా, అడ్డముగా, ఏటవాలుగా ఎటు కూడినా మొత్తం 33 వచ్చేలా వ్రాయండి. ఒక అంకెను ఒకసారి మాత్రమే ఉపయోగించాలి. మీ ఎంట్రీలను 10 రోజులలో కంప్ట. పోస్ట్‌కార్డ్/ ఇన్‌లాండ్/ ఎన్వెలప్‌పై వ్రాసి ఆర్డినరీ మెయిల్ ద్వారా పంపండి. ముందుగా చేరిన 10 ఎంట్రీలకు టైటాన్ రిస్ట్ వాచ్ గోల్డెన్ చైన్ బహూకరించబడును.

**SANDEEP TRADERS (AJSV)**
POST BOX No: 14, NEW DELHI-110 008


## మా ఆవిడకి మంత్రాలొచ్చు

ఆకలేసిన మా పసిపిల్లాడికి
పాలసీసా అయిపోతుంది.
ఉక్కపోస్తున్న మా నాన్నగారికి
విసనకర్రయిపోతుంది.
తిక్కొచ్చిన తన అత్తగారికి
నడ్డికింద పీట అయిపోతుంది.
రాత్రి పడగ్గదిలో నాకు
రగ్గయిపోతుంది.
పొద్దున్నే మా వాకిట్లో
ముగ్గయిపోతుంది

మా ఆవిడకు మంత్రాలొచ్చు

– తనికెళ్ళ భరణి

(మిత్రుడు భరణి ఒకప్పుడు మంచి హుషారుగా కవిత్వము, గట్రా వ్రాసేవారు. తర్వాత సీరియస్‌గా నాటకాలు రాశారు. ఒకప్పుడు 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకసంచికలో ఆయన రాసిన కవిత ఇది. – దాట్ల)